## క్లుప్తంగా

### ఇద్దరు యువతులకు ఆశ్రయం



యువతులతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

**సీతమ్మధార:** విశాఖపట్నంలో రైల్వే పోలీసులు, ఏయూటీడీ సంస్థ కలిసి మానవ అక్రమ రవాణా వ్యవహారం గుట్టు రట్టు చేశారు. ఒడిశాలోని నవరంగపూర్ తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తరలిస్తున్నట్లు గుర్తించిన రైల్వే పోలీసులు ఏయుటీడీ అధికారులతో కలిసి టీఎస్సార్ మహిళా షెల్టర్‌కు ఆదివారం రాత్రి తరలించారు. అమ్మాయిల పేర్లు సైత భత్ర (20), సుభద్ర భత్ర (19) అని, అంతకు మించి వివరాలు వెల్లడించడం లేదని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ యువతులను తీసుకెళ్లడం కోసం ఎవరెవరో వ్యక్తులు షెల్టర్‌కు వస్తున్నారని, ఇదే విషయమై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

### తక్షణమే ఫిర్యాదుల పరిష్కారం



అర్జీలు పరిశీలిస్తున్న జోన్‌-4 కమిషనర్ మల్లయ్యనాయుడు

**జగదాంబ:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్‌-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. జోన్‌-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ విభాగానికి 1, టౌన్ ప్లానింగ్‌కు 2, తాగునీటి సమస్యపై 1 చొప్పున ప్రజలు అందించిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు పరిష్కరించిన తర్వాత అర్జీదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, రెవెన్యూ అధికారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఆయుష్య హోమం



నాదస్వర కచేరీ చేస్తున్న కళాకారులు

**డాబాగార్డెన్స్:** బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరా సందర్భంగా సోమవారం ఆయుష్య హోమం జరిపారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 8 గంటలకు నిర్వహించే పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.2,516 పూజా రుసుం చెల్లించాలని ఈవో శోభారాణి తెలిపారు.

**నాదస్వర కచేరీ..**

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో దేవస్థానం, ఇతర దేవాలయాలకు చెందిన నాదస్వరం, డోలు విద్వాన్‌లచే నాదస్వర సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో శోభారాణి ప్రారంభించారు.

### మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

**డాబాగార్డెన్స్:** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు వర్ధంతి సోమవారం పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పాల్గొని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని, దేశ గొప్పతనాన్ని విదేశాల్లో చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ సందడి




**విద్యుత్ దీపాల వెలుగుల్లో సుందరంగా చర్చిలు**

**కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట**

నగరంలో కేక్ మిక్సింగ్ గంట మోగినప్పటి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ సమీపిస్తుండడంతో మార్కెట్లు, చర్చిలు కళకళలాడుతున్నాయి. విద్యుత్ వెలుగులతో చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్‌కు సంబంధించిన స్టార్స్, విద్యుత్ లైట్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ డ్రెస్సెస్, టోపీలు... ఇలా ఎన్నో రకాల డెకరేటివ్ పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. మరో వైపు వస్త్ర దుకాణాలు క్రైస్తవులతో కిటకిటలాడుతున్నాయి. చర్చిలలో ఇప్పటికే సందడి మొదలైంది. క్రిస్మస్ వేడుకల్లో పిల్లలకు ఎంత ప్రాధాన్యముందో అంతే కీలకమైన శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత వేషధారణలు) రెడీమేడ్‌గా మార్కెట్లో లభ్యమవుతున్నాయి. కొందరైతే సొంతంగా తయారు చేసుకుంటున్నారు. వేడుకల్లో కీలకమైన విభిన్న రకాల స్టార్స్ మార్కెట్‌లో వెలిగిపోతున్నాయి. నగరంలో క్రిస్మస్ ట్రీ రూప కల్పనకు ఆకాశమే హద్దు అన్నట్టు డిజైనర్ ట్రీలు అందుబాటులోకి వచ్చేశాయి. మరోవైపు పూర్ణా మార్కెట్ కూడా క్రిస్మస్ కళ సంతరించుకుంది. ఇక్కడి దుకాణాలన్నీ రకరకాల స్టార్లు, ట్రీస్‌లలో కళకళలాడుతున్నాయి. క్రిస్మస్, అనంతరం సంక్రాంతి పండగలుండడంతో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. – డాబాగార్డెన్స్/జగదాంబ




విద్యుత్ దీపాలంకరణలో జగదాంబ జంక్షన్‌లోని ట్రినిటీ లూథరన్ చర్చి



మార్కెట్లో విరివిగా క్రిస్మస్ ట్రీలు



జగదాంబ జంక్షన్ ట్రినిటీ లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన 30 అడుగుల ట్రీ



పూర్ణామార్కెట్‌లో విక్రయిస్తున్న క్రిస్మస్ ట్రీస్, శాంతాక్లాజ్ ప్రతిమలు



రకరకాల విద్యుత్ లైట్లు



నగరంలోని చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## కాలుష్య నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు

**డాబాగార్డెన్స్:** కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రివచ్చని, అందుకు అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాలినడకన కార్యాలయానికి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

## ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏఎంసీ విద్యార్థుల ఎంపిక

**మహారాణిపేట:** ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థులు బి.కిరణ్‌కుమార్(2021 బ్యాచ్), కాజల్ సింగ్ (2022 బ్యాచ్), డి.చరణ్‌నాయక్ (2024 బ్యాచ్) డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్(పురుషులు, మహిళలు) జట్టులో స్థానం సంపాదించారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లోని కళింగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ వద్ద జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాలలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్(క్రీడలు) డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, శారీరక విద్యా డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎస్.పాత్రుడు, డాక్టర్ ఆర్.ఎస్.భూషణరావు, డాక్టర్ పి.లక్ష్మణ్ రావు తదితరులు అభినందించారు. ఈ పోటీలకు ఎంపిక కావడం ఇతర వైద్య విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.



ఎంపికైన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, తదితరులు

## టీ-20 రన్నరప్ విశాఖ జట్టుకు కలెక్టర్ అభినందన

**మహారాణిపేట:** జిల్లా బధిరుల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. కలెక్టర్ సమావేశం మందిరంలో సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి జి.జాన్, దివ్యాంగుల శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తదితరులు ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను తీసుకొచ్చి కలెక్టర్‌ను కలిశారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన టీ-20 చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విశాఖ జిల్లా జట్టు రన్నర్ కప్ గెలుచుకుంది. రెండు రోజుల లీగ్ మ్యాచ్‌లో ఆటగాళ్లకు ఆహారం, వసతి కల్పించినందుకు దివ్యాంగులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన జట్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.ఎ.బేగ్, ప్రెసిడెంట్ హసీమ్ బేగ్, జనరల్ సెక్రటరీ కె.నాగార్జున సాగర్, అనువాదకుడు అబ్దుల్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖ జట్టు సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## 41వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ పూర్ణిమ



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదం చేస్తున్న కూటమి శ్రేణులు

**కంచరపాలెం:** జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నూతన సామాజిక భవనాన్ని సోమవారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. కాలనీలో ప్రజల అవసరాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఈఈ తారా ప్రసన్న రెడ్డి, ఏఈ సతీష్, నాయకులు మధుబాబు, రవిబాబు, వేళంగిణిరావు, ఎల్.కుమార్, సంజీవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**గత ప్రభుత్వంలో నిర్మాణం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.49.60 లక్షలతో సామాజిక భవనం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భూమిపూజ చేశారు. నిర్మాణం పూర్తయిన సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం నిలిచిపోయింది. నేడు కూటమి ప్రభుత్వంలో హంగు ఆర్భాటాలతో ఈ భవనాన్ని ప్రారంభించారు.

**కూటమి నాయకుల వాగ్వాదం**

సామాజిక భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో వార్డు కార్పొరేటర్ పూర్ణిమ, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కూటమి నాయకులు, కార్యకర్తలు వాగ్వాదం చేశారు. వార్డులో పెచ్చుమీరుతున్న దళారి వ్యవస్థను పూర్తిగా అరికట్టాలని కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత మూడేళ్లలో సొంత నిధులతో వార్డును అభివృద్ధి చేస్తుంటే.. నేడు స్థానిక కూటమి నాయకులు దళారీ వ్యవస్థను నడిపిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 28న జీవీఎంసీ దుకాణాలకు వేలం

**జగదాంబ:** జీవీఎంసీ జోన్‌-4 పరిధిలోని దుకాణాలు, కల్యాణ మండపాలకు ఈ నెల 28న వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. 31వ వార్డులోని డయాస్ ట్యాంక్ వాణిజ్య సముదాయం పై అంతస్తులోని షాపులు, కింద సెల్లార్లలో ఉన్న 9, 10, 11, 12, 13, 15 దుకాణాలకు, టీఆర్ఎస్ కాంప్లెక్స్‌లోని 3, 25, 26, 31, 35, 39, 47, 21 దుకాణాలకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. 35వ వార్డు పాత బస్‌స్టాండ్‌లో పేజ్‌-2లోని 1 నుంచి 14 దుకాణాలు, సూర్యాబాగ్ వద్ద జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 9వ నంబర్ షాపు, 39వ వార్డు పద్మానగర్ లక్ష్మీటాకీస్ వద్ద వాణిజ్య సముదాయం దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితికి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28న జోన్‌-4 కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొవాలని కోరారు. వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని జెడ్సీ తెలిపారు.

## 24 గంటల్లోనే మిస్సింగ్ కేసు ఛేదన



యువతిని ఆమె తల్లికి అప్పగిస్తున్న మహారాణిపేట పోలీసులు

**అల్లిపురం:** యువతి తప్పిపోయినట్లు వచ్చిన మిస్సింగ్ కేసును 24 గంటల్లోపే మహారాణిపేట పోలీసులు ఛేదించారు. వివరాలిలా.. తాడివీధికి చెందిన పెంట ప్రమీల ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో యువతి తల్లి రాంబాయి మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన సీఐ బాసు భాస్కరరావు, హెచ్‌సీ రవికుమార్‌లు దర్యాప్తు చేపట్టారు. యువతి ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాజువాకలో ప్రమీలను గుర్తించారు. ఆమెను తీసుకొచ్చి సోమవారం తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా యువతి తల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు సిద్ధం



వీల్‌చైర్‌లో వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుడు

**మహారాణిపేట:** దివ్యాంగులు నేరుగా కలెక్టర్‌ను కలిసే విధంగా అవసరమైన వీల్ చైర్లు సిద్ధం చేసినట్టు కలెక్టర్ కార్యాలయంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం పలు ప్రాంతాల్లో వీల్ చైర్లు సిద్ధంగా ఉంచారు. మెయిన్ గేటు నుంచి దివ్యాంగులు నేరుగా కలెక్టర్ దగ్గరకు వచ్చి వినతిపత్రం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం అనేక మంది దివ్యాంగులు కలెక్టర్‌కు నేరుగా వినతిపత్రాలు అందజేశారు. అలాగే రిసెప్షన్ సెంటర్, హెల్ప్ డెస్క్, ఇతర సమాచారం కూడా సిద్ధం చేశారు.

## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

**మహారాణిపేట:** పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని, ఈ బాధ్యతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్వీకరించాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 29వ వార్డు మహారాణిపేట ఎంవీడీ హైస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమాజంలోని ప్రతి వ్యక్తిని మార్గదర్శకం చేయాలని కోరారు. వీర్ బాల్ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నారని, విజేతలకు ఈ నెల 26న బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుద్ధ జగన్నాథరావు, బాల్ వీర్ దివస్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్తలు రూపాకుల రవికుమార్, దానేశ్వరరావు, బీజేపీ నాయకులు చుక్కాకుల రాంబాబు, పల్లా చలపతి, గణపతిరావు, సిహెచ్.రాజబాబు, దేవర చంద్రశేఖర్, దశమంతల సుశీల, ఒ.ఆల్బర్ట్, శ్రీను, అధిక సంఖ్యలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల నిరసన

**మహారాణిపేట:** అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న తమకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని దివ్యాంగులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు దివ్యాంగులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమకు అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో నెలకు రూ. 15 వేలు జీతం ఇస్తున్నారని, ప్రభుత్వ పథకాలేవీ తమకు అమలు కావడం లేదన్నారు. చాలీచాలని జీతాలతో ఎలా బతకాలని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

## విద్యార్థులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

**డాబాగార్డెన్స్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా అధ్యక్షుడు నాయుడు సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా 36వ మహాసభలు నిర్వహించిన నేపథ్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని హామీనిచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నెలలు గడుస్తున్నా.. విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ ముక్కు పిండి వసూలు చేస్తున్నాయన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, యూనివర్సిటీల్లో పర్మినెంట్ వీసీలను నియమించి, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సరిపడా మెస్ చార్జీలు పెంచి హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిందని, నూతన ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

**జిల్లా కమిటీ ఎన్నిక**

ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా నూతన కమిటీ, జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా మొత్తం 30 మందిని ఎన్నుకున్నట్టు రాష్ట్ర కార్యదర్శి అశోక్ తెలిపారు. నూతన కమిటీలో జిల్లా కార్యదర్శిగా ఎల్‌జే నాయుడు, అధ్యక్షుడిగా జి.అజయ్‌ను మహాసభ ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.రాము, జి.పల్లవి, పి.సాయితేజ, జిల్లా సహాయ కార్యదర్శులుగా శశికుమార్, కౌశిక్, వెంకటరమణ, అజయ్ ఎన్నికయ్యారు.

## సిరులతల్లికి విశేష పూజలు

**డాబాగార్డెన్స్:** మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 22వ రోజు సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథ స్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.